లింక్‌రోడ్లకు మరమ్మతు ఎప్పుడో?

- గుంతలమయంగా మారిన మట్టిరోడ్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



గుంతలమయంగా మారిన ఎంగంపల్లి, ఆకునెల్లికుదురు రోడ్డు



అభివృద్ధికి నోచుకోని తాడూరు నుంచి కోలంపు మీదుగా ఇంద్రకల్‌కు వెళ్లే రోడ్డు

తాడూరు: మండలంలోని వివిధ గ్రామాల మధ్య ఉన్న లింక్‌రోడ్ల మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా తయారయ్యాయి. గ్రామాలకు ప్రధాన రోడ్డు మార్గం ద్వారా రాకపోకలు సాగించే వారికన్నా లింక్ రోడ్లను వినియోగించే వారి సంఖ్య అధికంగా ఉంది. రైతులు పొలాలకు వెళ్లడానికి, మరో గ్రామం నుంచి కూలీలను తీసుకురావడానికి లింక్‌రోడ్లపైనే రాకపోకలు కొనసాగిస్తారు. అనుబంధ రోడ్లు అభివృద్ధికి పాలకులు పట్టించుకోకపోవడంతో ఆయా గ్రామీణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నామమాత్రంగా పనులు

గ్రామాల మధ్యన ఉన్న లింక్‌రోడ్ల మరమ్మతుకు స్థానిక ప్రజాప్రతినిధులు అడపాదడపా నిధులు ఖర్చు చేస్తున్నా నిరుపయోగంగా మారాయని విమర్శలు వినిపిస్తున్నారు. మెటల్ రోడ్లతో పాటు మట్టి రోడ్లపై తాత్కాలికంగా ట్రాక్టర్లతో మట్టిని పోయిస్తున్నారే తప్పా శాశ్వతంగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. నామమాత్రంగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారు.

మండలంలో ఇలా..

మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఒక్కో గ్రామంలో మండల కేంద్రానికి అనుబంధ రోడ్ల ద్వారా చేరుకుంటున్నారు. సమయం తక్కువ అవుతుందని వాహనదారులు అనుబంధ రోడ్లనే వినియోగిస్తున్నారు. మండల కేంద్రం నుంచి ఇంద్రకల్ మీదుగా జడ్చర్ల వెళ్లే ఆర్‌అండ్‌బీ డబుల్ రోడ్డుకు 4 కి.మీ లింక్‌రోడ్డు ఉంది. అదేవిధంగా ఎంగంపల్లి నుంచి అకునెల్లికుదురుకు రెండు కిలోమీటర్లు మట్టి రోడ్డు ఉంది. పాపగల్ నుంచి సిర్సవాడ, తుమ్మల సూగురు నుంచి ఐతోలు, తిర్మలాపూర్ నుంచి చర్ల యిటిక్యాల, అల్లాపూరు నుంచి పొల్మూరు, గుట్లలపల్లి, యత్మాతాపూరు నుంచి లచ్చిరాంతండా, యాదిరెడ్డిపల్లి నుంచి గుంతకొడూరు గ్రామాల మధ్య ఉన్న లింక్‌రోడ్లు మట్టిరోడ్డు కావడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రానికి చేరుకోవడానికి బీటీ రోడ్లపై ప్రయాణిస్తే అదనంగా 8 నుంచి 10 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అనుబంధ రోడ్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ఆయా మండల ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



ఆయా గ్రామాలను కలిపే లింక్‌రోడ్లకు నామమాత్రంగా మరమ్మతు చేస్తున్నారు. అభివృద్ధి చేసి బీటీ రోడ్లుగా మార్చాలి. దశాబ్దాల కిందట వేసిన మెటల్ రోడ్లు ప్రస్తుతం కంకర తేలి గుంతలమయంగా మారాయి. పాలకులు హామీలకే పరిమితం అయ్యారు.

– కురుమూర్తి, యాదిరెడ్డిపల్లి

బీటీగా మార్చాలి



మండలంలోని ఆయా గ్రామాలను కలిపే లింక్‌రోడ్లను బీటీగా మార్చాలి. వర్షం వచ్చిందంటే ప్రయాణం నరకయాతనగా మారి, రాత్రి వేళ వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గుంతలను పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలి.

– నాగయ్య, మాజీ సర్పంచ్, పొల్మూరు

నివేదికలు పంపించాం



మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలను కలిపే లింక్‌రోడ్లను సంబంధిత ఏఈల ద్వారా నివేదికలను అందజేశాం. నిధులు మంజూరు అయిన వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. గ్రామీణ ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఆంజనేయులు, ఎంపీడీఓ, తాడూరు

ప్రణవ్‌ను అభినందించిన సీఎం రేవంత్‌రెడ్డి



కల్వకుర్తి రూరల్: పట్టణానికి చెందిన జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బాలాజీ సింగ్ కుమారుడు ఠాకూర్ ప్రణవ్ గోపాల్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం హైదరాబాదులోని తన నివాసంలో అభినందించారు. ప్రణవ్ అమెరికాలోని డ్యూక్ యూనివర్సిటీలో ఉన్నత చదువులు చదివేందుకు వెళ్తున్నాడు. రాష్ట్రంలో ముగ్గురికి మాత్రమే ఆ యూనివర్సిటీలో అవకాశం లభించింది. ప్రణవ్ గతంలో నాసా వారితో కలిసి చేసిన రాకెట్ ప్రయోగానికి సంబంధించిన అంశాలను రాష్ట్ర ముఖ్యమంత్రికి వివరించారు. ఆసియాలో మొదటి స్థానంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఆరవ స్థానం అతనికి లభించింది. రాకెట్ లాంచింగ్ డిజైనింగ్‌లో అనుభవం ఉంది. అదే విభాగంలో ఎమ్మెస్ చేసేందుకు డ్యూక్ యూనివర్సిటీకి వెళుతూ సీఎం ఆశీస్సులు తీసుకున్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సైతం ప్రణవ్‌తో పాటు తండ్రి బాలాజీ సింగ్ ను అభినందించారు.

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి చేయూత



కల్వకుర్తి రూరల్: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న మాత పోచమ్మ దేవాలయానికి పార్టీ సీనియర్ నాయకుడు గుర్రాల రాంభూపాల్ రెడ్డి చేయూతనందించారు. సోమవారం పార్టీ రాష్ట్ర నాయకుడు తల్లోజు ఆచారి చేతుల మీదుగా దేవాలయ నిర్మాణానికి రూ.25 వేలు నిర్వాహకులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి అందరూ సహకరించాలని ఆచారి కోరారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



వెల్దండ: మండలంలోని కంటోనిపల్లి గ్రామానికి చెందిన కంతం అంజమ్మకు సీఎంరిలీఫ్ ఫండ్ నుంచి రూ.21500లు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం మాజీ సర్పంచ్ పెద్ది రామకృష్ణ బాధితురాలికి చెక్కు అందజేశారు. మాజీ ఉపసర్పంచ్ సురేందర్, కార్యదర్శి ఫయాజ్ తదితరులు ఉన్నారు.

రిజర్వేషన్లు అమలు చేయాలి

కొల్లాపూర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన కొల్లాపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. రిజర్వేషన్ల అమలుకు కేంద్రం చర్యలు చేపట్టాలన్నారు. బీసీల సంక్షేమం పట్ల బీజేపీకి నిజమైన చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌ను ఆమోదించాలన్నారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు. సమావేశంలో నాయకులు శివవర్మ, సలీం, బాలపీరు, రాజు తదితరులు ఉన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



వెల్దండ: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీమతి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చొక్కన్నపల్లిలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు అరగంటలోపు ముర్రుపాలు పట్టించాలన్నారు. అంగన్‌వాడీ ద్వారా అందిస్తున్న పౌష్టికాహారంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మెర్లీన్, మాసమ్మ, స్వప్న, అలివేలు, శివలీల, మల్లమ్మ, తదితరులు ఉన్నారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి



అచ్చంపేట రూరల్: కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ కార్మికులకు ఒక రోజు వేతనం రూ. 800 ఇవ్వాలన్నారు. గ్రామాలలో వ్యవసాయ కార్మికుల పేర్లను గ్రామపంచాయతీలో రిజిస్టర్ చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు సైదులు, నాగరాజు, శ్రీను, అమరేందర్‌గౌడ్, కొండల్, నిరంజన్, జావిద్ పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పరశురాములు

కల్వకుర్తి రూరల్: భారత కమ్యూనిస్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్న పులిజాల పరశురాములను ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా సోమవారం ఎంపికయ్యారు. పార్టీ అభ్యున్నతికి విశేష కృషి చేయడంతో జిల్లా కౌన్సిల్‌లో చోటు కల్పించినట్లు జిల్లా కార్యదర్శి ఫయాజ్ తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రొసీడింగ్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి టౌన్: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికి ఇళ్లను కేటాయించామని, క్షేత్రస్థాయిలో చాలావరకు ప్రారంభమయ్యాయన్నారు. నిబంధనల మేరకు యాప్‌లో 40–60 గజాలలోపే ఇంటి నిర్మాణాన్ని అప్‌లోడ్ చేసేలా సాఫ్ట్‌వేర్ ఉండటంతో లబ్ధిదారులు ఆ విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే వారికి మలివిడతలో ఇండ్లు కేటాయించేలా చూస్తానని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీకి 400 ఇళ్లు మంజూరు కాగా, వాటిలో మొదటి విడతలో 209 ఇళ్లు కేటాయించగా, వారిలో 109 మందికి ఇళ్ల ప్రొసీడింగ్‌లను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం మున్సిపాలిటీలోని పలు వార్డులలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను ఆయా వార్డుల నాయకులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్, వార్డు ఆఫీసర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

భక్తిభావంతో మెలగాలి

వెల్దండ: ప్రజలందరు భక్తిభావంతో మెలగాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొట్రలో చెన్న కేశవ స్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, బీఆర్‌ఎస్ కార్యకర్తలతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు వితరణ



పెద్దకొత్తపల్లి: చంద్రబండ తండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు, టై, బెల్టులు, షూ, పలకలను గిరిజన సంఘం నాయకుడు కేతావత్ శంకర్ సమకూర్చాడు. సోమవారం పాఠశాలలో విద్యార్థులకు ఆయన పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం రమేష్, పంచాయతీ కార్యదర్శి మహేష్‌గౌడు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శంకర్, మాజీ సర్పంచ్‌లు బాలునాయక్, వెంటస్వామి గౌడులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో వ్యక్తికి రిమాండ్

లింగాల: డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వంగూర్ మండలం కోనేటిపురానికి చెందిన చిలికేశ్వరంరాజుకు సోమవారం న్యాయమూర్తి రెండు రోజుల రిమాండ్ విధించారని ఎస్‌ఐ వెంకటేశ్వర్‌గౌడు తెలిపారు. పట్టుబడిన 7 మందిని అచ్చంపేట కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి ఒకరికి రిమాండ్ మరో 6 మందికి జరిమానా విధించారని ఎస్‌ఐ తెలిపారు.

ఢిల్లీకి తరలిన కాంగ్రెస్ శ్రేణులు

చారకొండ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధన కోసం ఢిల్లీలో నిర్వహిస్తున్న మహాధర్నాకు సోమవారం మండలంలోని కాంగ్రెస్ సీనియర్ నాయకులు తరలివెళ్లారు. హైదరాబాద్ నుంచి ఢిల్లీకి రైలు మార్గం ద్వారా బయలు దేరారు. కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా మాట నిలబెట్టుకొని 42 శాతం రిజర్వేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉందని మాజీ జెడ్పీటీసీ వెంకట్ గౌడ్ అన్నారు. ఢిల్లీకి వెళ్లిన వారిలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి జైపాల్, సహదేవ్ తదితరులు ఉన్నారు.

బీజేపీతోనే గ్రామీణ వికాసం

మన్ననూర్: రాష్ట్రంలో గ్రామీణ వికాసం బీజేపీతోనే సాధ్యం అవుతుందని ఆ పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు బల్మూర్ జానకి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంగ్యానాయక్ అన్నారు. సోమవారం అమ్రాబాద్ మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మన్ననూర్ గ్రామంలోని 269–270 బూత్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు వెలిజాల శ్రీను, సోముల చంద్రయ్యగౌడ్, శేఖర్, ప్రసాద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

లింగాల: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మండల పార్టీ అధ్యక్షుడు గువ్వని నవీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటిశెట్టి పార్టీ శ్రేణులను కోరారు. మహాసంపర్క అభియాన్‌లో భాగంగా సోమవారం లింగాల, అంబట్‌పల్లి గ్రామాల్లో ఇంటింటికీ బీజేపీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు ఇస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు శేఖర్, నాయకులు విష్ణుచారి, సేవ్యా, సైదులు, సత్యనారాయణ, హేమంత్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మన్ననూర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

బీజేపీకే పట్టం కట్టాలి

ఉప్పునుంతల: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకే పట్టం కట్టాలని ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు వావిలాల రమేష్ కోరారు. మండల కేంద్రలో ఇంటింటికి బీజేపీ, ప్రతి ఇంటికి పోలింగ్ బూత్ అధ్యక్షుడు అనే కార్యక్రమంలో భాగంగా ప్రజలను కలిసి బీజేపీ పార్టీ బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల కార్యదర్శి మొగిలి చంద్రు, నాయకులు శివశంకర్, రాజు, సాయిబాబుయాదవ్, జగన్, శ్రీనివాస్‌గౌడ్, అంజనేయులు, భాస్కర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు బానిస కావొద్దు



తిమ్మాజిపేట: యువత డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం సామాజిక స్పృహ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడిపొద్దన్నారు. బాగా చదివి ఉన్నత స్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణశెట్టి, ప్రిన్సిపాల్ అనసూయ, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శ్రీశైలం, మండల కన్వీనర్ వెంకటేష్, స్థానిక నాయకులు శ్రీను, రామకృష్ణ, శివ, లోకేష్, శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

కవి గాయకుడు నర్సింహకు సన్మానం



మన్ననూర్: తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని యూత్ హాస్టల్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ కవి గాయకుడు మాడ్గుల నర్సింహ్మను ఘనంగా సన్మానించారు. కొంతకాలంగా పల్లె సుద్దులు, పాటలు, శిబిరాలు ఏర్పాటు చూస్తూ తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లా, మండలాలు, గ్రామాలలో యువతీ యువకులను ఎయిడ్స్ బారిన పడకుండా ఉండేందుకు తన కళా రూపాల ద్వార చైతన్యం చేస్తున్నారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం ప్రజాసేవ, ప్రజా సంక్షేమం కోసం తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

యోగా పోటీల్లో విద్యార్థి ప్రతిభ



కందనూలు: జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం ఆరో జిల్లా స్థాయి యోగా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలో జిల్లా కేంద్రానికి చెందిన విగ్నేష్ ఫార్వర్డ్ బెండింగ్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చి మొదటి స్థానంలో నిలిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరేందర్, యోగా గురువు శివానందస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడికి ఆర్థికసాయం

తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన గన్నోజు శివచారి మూడు రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న 2005–2006 బ్యాచ్ మిత్రులు డబ్బులను పోగు చేసుకొని రూ.50వేలను మిత్రుడు శివచారికి అందజేశారు. కార్యక్రమంలో బాషమోని రమేష్, నరేష్‌చారి, రాముడు, ఎండీ షబ్బీర్, మిత్రులు పాల్గొన్నారు.

మాయావతిని ప్రధానిని చేయడమే లక్ష్యం

నాగర్‌కర్నూల్ రూరల్: దేశానికి మాయావతిని ప్రధానిని చేయడమే బీఎస్పీ లక్ష్యమని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఎమ్మెల్సీ అతార్‌సింగ్ రావు అన్నారు. సోమవారం స్థానిక పట్టణంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంచందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బహుజనుల రాజ్యాధికారం కోసం నిరంతరం పాటుపడాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, కమ్యూనిస్టులు పార్టీలు బహుజనులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయన్నారు. ఆ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న, రాష్ట్ర కోశాధికారి దాస్, అసెంబ్లీల ఇన్‌చార్జ్‌ల కుమార్, నాగేష్, కురుమయ్య, మల్లన్న, బాలు పరశురాం, భాస్కర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



పెద్దకొత్తపల్లి: ఎరువుల దుకాణాల డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఏఓ శిరిష అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సంఘం, ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు చేసిన ఎరువులు, క్రిమిసంహారక మందులకు డీలర్ల నుంచి తప్పనిసరిగా రశీదులను పొందాలని ఆమె సూచించారు. సిబ్బంది, డీలర్లు ఉన్నారు.

వేతనాలు చెల్లించాలి

కోడేరు: మండల కేంద్రంలోని మాడల్‌స్కూల్‌లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి వేతనాలు చెల్లించాలని సిబ్బంది దాసు కోరారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో దీంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కొత్త భవనంలోకి మారారు.. పాతది వదిలేశారు



లింగాల: మండల కేంద్రంలో కొన్నేళ్ల నుంచి వాడుకలో ఉన్న మండల వ్యవసాయ శాఖ కార్యాలయం ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. వ్యవసాయ శాఖ కార్యకలాపాలు అన్ని ఏఓతో పాటు ఏఈఓలు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన రైతు వేదికలలో నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలో ఉన్న పాత వ్యవసాయ కార్యాలయాన్ని వదిలేసి రైతు వేదికలోనే అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. దీనితో పాత దాని ఆలనా పాలనా చూసే వారు కరువయ్యారు. పాత భవనం నిర్వహణ లేకపోతే శిథిలావస్థకు చేరుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిరుపయోగంగా ఉన్న ఈ భవనాన్ని మరో ప్రభుత్వ శాఖకు కేటాయించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

వెల్దండ: ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మొబైల్ హెల్త్ క్యాంప్ ఏర్పాటుచేసి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అధునాతన టెక్నాలజీతో రూపొందించిన వన్‌మెడిహబ్ మొబైల్ యూనిట్ ద్వారా ఒక గంటలో 150పైగా పరీక్షలు నిర్వహించే సామర్థ్యంతో డిజైన్ చేసినట్లు వివరించారు. ముఖ్యంగా లివర్‌కి సంబంధించి బిల్రుబిన్, కిడ్నీలకు సంబంధించి కొలెస్ట్రాల్, కాల్షియం, యూరియా, షుగర్ తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ఈనెల 6వ తేదీన ఆమనగల్లు మండలం మేడిగడ్డతండాలో వైద్య శిబిరం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వన్‌మెడిహబ్ ఫౌండర్ సంతోష్‌కుమార్, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న రాఘవేందర్‌రెడ్డి

ఎంపీ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకుల ధర్నా



రాస్తారోకో నిర్వహిస్తున్న కాంగ్రెస్, వివిధ కుల సంఘాల నాయకులు

పెద్దకొత్తపల్లి: ఎంపీ మల్లురవి మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నర్సింహ్మకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ సోమవారం కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో ఆందోళన చేపట్టారు. ఈనెల 2వ తేదీన కొల్లాపూర్‌కు వచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సభలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి మాట్లాడుతుండగా సమయభావం తక్కువగా ఉందని ప్రసంగాన్ని ముగించాలని చిట్టిపై రాసిచ్చిన మార్కెట్ కమిటీ చైర్మన్‌ను ఎంపీ ఇస్టానుసారంగా దూషించి అవమానపర్చడం తగదన్నారు. గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో వాహనాలు బారులు తీరి ట్రాఫిక్ జాం అయ్యింది. ఎస్‌ఐ సతీష్ ధర్నా చేస్తున్న వారికి నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు ధర్మేందర్, బద్యానాయక్, మత్స్యకార్మిక సంఘం నాయకులు రామస్వామి, మండల అధ్యక్షుడు ఎల్లయ్య, మాజీ వార్డు సభ్యులు మహేష్, రవినాయక్, శ్రీరాములు, శ్రీను, భీరయ్య , బుడగ జంగాల నాయకులు పాల్గొన్నారు.